# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 07-01-2025 | సంపుటి : 06 | సంచిక : 96 | పేజీలు : 8 | వెల : రూ 3-00



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787


## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దుశ్చర్య.. మందుపాతర పేలి ఎనిమిది మంది జవాన్లు మృతి


రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులకు పేలుళ్లకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లా భేద్రే కుట్రు రహదారిలో ఐఈడీ పేలుళ్లకు మావోయిస్టులు పాల్పడ్డారు. ఐఈడీ పేలిన సమయంలో పోలీసుల వాహనంలో 15 మంది డీఆర్‌జీ జవాన్లు ఉన్నారు. 8 మంది జవాన్లతో పాటు డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జవాన్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. గాయపడ్డ జవాన్లను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే కూంబింగ్ తర్వాత తిరిగి వెళ్తున్న జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని పేలుళ్లకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

## చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ..




హైదరాబాద్: చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డితో పాటు కేంద్రమంత్రి అశ్విన్ వైష్ణవ్ వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. కనెక్టివిటీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని మోడీ అన్నారు. మెట్రో నెట్ వర్క్ 1000 కిలోమీటర్లకు పైగా విస్తరించిందని మోడీ చెప్పారు. జమ్ము కశ్మీర్, ఒడిశా, తెలంగాణలో కొత్త కనెక్టివిటీకి ఏర్పాట్లు జరిగాయన్నారు. ఒక్కో అడుగు వేసుకుంటూ దేశంలో కొత్త పుంతలు తొక్కిస్తున్నామని, రైల్వే ఆదునికీకరణకు ప్రధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రైల్వే రంగంలో మౌళిక సదుపాయాలకు ప్రధాన్యం ఇస్తున్నామని ప్రధాని చెప్పారు. దేశంలో హైస్పీడ్ రైళ్ల కోసం డిమాండ్ పెరుగుతోందని, దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచేలా కృషి చేస్తున్నామని తెలిపారు. దేశంలో 35 శాతం విద్యుదీకరణ పూర్తి చేశామని.. ఇప్పటికే వందే భారత్, నమో భారత్, అమృత్ భారత్ రైళ్లు తీసుకొచ్చామన్నారు. గత దశాబ్దకాలంలో రైల్వే కొత్త రూపం సంతరించుకుందని చెప్పారు. రైల్వేల ఆదునికీకరణ దేశం ముఖచిత్రాన్నే మారుస్తోందని మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు సోమన్న, కిషన్ రెడ్డి, బండి సంజయ్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొన్నారు. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభినందుకు సిఎం రేవంత్ రెడ్డి ప్రధానికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఈ టెర్మినల్ ను రూ.413 కోట్లతో అత్యాధునిక హంగులతో ఆధునికీకరించారు.

## స్వర్ణ కుప్పం విజన్-2029 ఆవిష్కరణ..



చిత్తూరు: "స్వర్ణ కుప్పం విజన్-2029" డాక్యుమెంటరీని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘనంగా ఆవిష్కరించారు. కుప్పంలోని ద్రవిడ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్యుమెంటరీని సీఎం చంద్రబాబు విడుదల చేశారు. అంతకుముందు నడిమూరు గ్రామంలో 'సూర్య ఘర్' సోలార్ పైలట్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు, మంత్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు. స్వర్ణ కుప్పం విజన్-2029 ఆవిష్కరణ అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "అసాధ్యం అన్న వాటిని సుసాధ్యం చేసి నిరూపించిన పార్టీ తెలుగుదేశం. విజన్-2020 తయారు చేసినప్పుడు చాలా మంది విమర్శించారు. ఒక డైరెక్షన్ లేకుండా జీవితాల్లో ఎవ్వరూ పైకి రాలేరు. ఏ వ్యక్తి అయినా సరే పద్ధతి ప్రకారం పని చేయగలిగితే జీవితంలో ఏదైనా సాధించే స్థితికి చేరుతారు. తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే ప్రజలకు శాపాలుగా మారుతాయి. సరైన నిర్ణయాలు తీసుకుంటే చరిత్ర మారిపోయే పరిస్థితి ఉంటుంది. మన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు దేశ ప్రధాని అయిన తర్వాత అనేక ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఈ సంస్కరణల వల్ల ఆయన దేశం దశదిశ మార్చారన్న విషయం మనందరం గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. మన్మోహన్ సింగ్ కూడా మంచి ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి మరవలేని వ్యక్తిగా నిలిచారు. ద్రవిడ యూనివర్సిటీ రావడానికి కారణం నందమూరి తారక రామారావు. బాగా కష్టపడితే 2030 నాటికి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే భారత్ నెంబర్ వన్‌గా నిలుస్తుంది. అమెరికాలో అమెరికన్ల తలసరి ఆదాయం కంటే భారతీయులు, తెలుగు వారిదే ఎక్కువ. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు చాలా స్పష్టంగా ఐదేళ్లకు నిర్దిష్టమైన ప్రణాళికలు రచించి దేశంలో ఎక్కడా జరగనంత అభివృద్ధిని ఆంధ్రప్రదేశ్‌లో చేశాం. ఆ తర్వాత వచ్చిన వైసీపీ వల్ల నాలుగు శాతం అభివృద్ధి తగ్గిపోయింది. విజన్-2029కు సంబంధించి రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తామనే దానిపై నిర్దిష్టమైన టార్గెట్లు పెట్టుకున్నాం. నేను ఏదైనా లక్ష్యం పెట్టుకుంటే సాధించే వరకూ ఎక్కడా వెనకాడను. ఆంధ్రప్రదేశ్ స్వర్ణ కమ్యూనిటీస్ డెవలప్మెంట్ ఏ విధంగా చేయాలనే దానిపైనా విజన్ చేశాం. పేదవాళ్లు అనుకున్నంత ప్రగతిని సాధించలేకపోయారు. అందుకే ఈ కొత్త విజన్ పెట్టుకున్నామని" చెప్పారు.

## రాజకీయాలకు అతీతంగా విద్యాభివృద్ధే మా లక్ష్యం



అందుకే స్ఫూర్తి ప్రదాతల పేర్లతో ప్రభుత్వ పథకాలు!
చాగంటి సలహాలతో నైతిక విలువలపై పాఠ్యాంశాలు
ఉండి అభివృద్ధికి రఘురామ చేస్తున్న కృషి భేష్
టాటా సేవలకు గుర్తుగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్
ఉండి నియోజకవర్గంలో మంత్రి లోకేష్ సుడిగాలి పర్యటన

ఉండి /భీమవరం: విద్యను రాజకీయాలకు అతీతంగా ఉంచేందుకే విద్యార్థులకు స్ఫూర్తి కలిగించేలా మన చరిత్రను, సంస్కృతిని గుర్తుచేసేలా విద్యారంగంలో విశేష సేవలందించిన వ్యక్తుల పేర్లను ప్రభుత్వ పథకాలకు పెట్టి, వాటినిసమర్థవంతంగా ముందుకు తీసుకెళుతున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా విద్యారంగాన్ని తీర్చిదిద్దాలన్నదే తమ అభిమని అన్నారు. విద్యావ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచాలని నేను మొదటి నిర్ణయం తీసుకున్నాను. నేను మంత్రి అయిన వెంటనే రాజకీయ నాయకుల ఫోటోలు, రంగులు తీసేయమని ఆదేశాలు జారీ చేసాను. స్కూల్స్ లో ఒక్క జాబ్ మేళాలు తప్ప ఇతర ఏ కార్యక్రమాలు నిర్వహించకూడదు అని నిర్ణయం తీసుకున్నాను. రాజకీయ కార్యక్రమాలకు పిల్లల్ని తీసుకోని వెళ్ళకూడదు అని స్ట్రిక్ట్ గా చెప్పానని లోకేష్ తెలిపారు. ఇటీవల ఆధునీకరించిన ఉండి జెడ్పి హై స్కూల్ భవనంతోపాటు బ్యాడ్మింటన్, టెన్నిస్ కోర్టులను మంత్రి లోకేష్ ప్రారంభించారు. హైస్కూలునుంచి గ్రామంలోకి రూ.18లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఉండి హైస్కూలు నుంచి పెదఅమిరంలో దివంగత రతన్ టాటా విగ్రహాన్ని ఆవిష్కరించారు. తర్వాత రతన్ టాటా మార్గ్ గా నామకరణం చేసిన భీమవరం ? ఉండి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. సాగి ప్రసాదరాజు సౌజన్యంతో 35లక్షలతో వాటర్ ప్లాంట్ ను మంత్రి లోకేష్ వేదికపై నుంచి వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన అమిరంలోని ఎస్ఆర్ కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన సభలోమంత్రి లోకేష్ మాట్లాడుతూ... 108ఏళ్ల చరిత్ర కలిగిన ఈ స్కూలు ప్రారంభోత్సవానికి రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. మనసున్న మహారాజు పీవీజీ రాజు గారు విద్యాభివృద్ధి కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేసారు. ఆయన ఆస్తులు దానం చేసి ఎన్నో స్కూల్స్ ఏర్పాటు చేసారు. విద్యను అందరికీ అందుబాటులోకి తెచ్చారు. ఎయిడెడ్ స్కూల్స్ వ్యవస్థను ప్రారంభించారు. సిరీస్ రాజు గారి లాంటి ఎంతో మంది గొప్ప వాళ్ళు ఈ స్కూల్లో చదువుకున్నారు. సమావేశానికి వచ్చిన విద్యార్థులను చూస్తే కాలేజి రోజులు గుర్తు వస్తున్నాయి. కాలేజీలో ఫ్రెండ్ షిప్ జీవితాంతం గుర్తుంటుంది. 2019-24వరకు కుటుంబం ఇబ్బందులు పడ్డట్టపుడు నాకు స్నేహితులు అండగా నిలిచారు. తల్లిదండ్రులకు చెప్పలేని విషయాలను మిత్రులకు చెప్పి పరిష్కరించుకోవాలి.

నాకు కఠినమైన ప్రయాణం ఇష్టం. మంగళగిరిలో 1985 తర్వాత టిడిపి గెలవలేదు. 2019లో 5300 ఓట్లతో ఓడిపోయా. అయిదేళ్లు నియోజకవర్గానికి వదలకుండా కష్టపడ్డా. ప్రజల ఆశీస్సులతో 91వేల మెజారిటీతో గెలిచాను. దేవుడు ఒక్కొకరికి ఒక్కో రకమైన పరీక్ష పెడతాడు. పరీక్షను జయించే శక్తి మనకు ఇస్తాడు. సంకల్పంతో పనిచేస్తే ఏదైనా సాధించగలం. నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడి జీవన ప్రయాణం చేయాలి.

## ఏ శాఖ మీద అవగాహన లేని సకల శాఖల మంత్రి.. నారా లోకేశ్‌ను గుడివాడ అమర్‌నాథ్ సెటైర్లు

విజయవాడ, జనవరి 6,ఏపీ మంత్రి నారా లోకేశ్‌పై మాజీ మంత్రి, వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలోని ఏ శాఖ మీద అవగాహన లేకుండానే నారా లోకేశ్ సకల శాఖల మంత్రిగా తయారయ్యారని ఎద్దేవా చేశారు. వైజాగ్‌లో గుడివాడ అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్ జగన్ మీద మాట్లాడి లోకేశ్ అభాసుపాలయ్యారని విమర్శించారు. ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులన్నీ వైసీపీ ప్రభుత్వ హయాంలో వచ్చినవేనని గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కానీ జగన్ పాలనలో వచ్చిన ప్రాజెక్టులను తమ పాలనలో




వచ్చినట్లు టీడీపీ నేతలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఉత్తరాంధ్రకు చంద్రబాబు ఏం చేశారో చెబితే బాగుంటుందని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లాలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, మూలపేట పోర్టు నిర్మాణం నారా లోకేశ్‌కు కనిపించడం లేదా అని గుడివాడ అమర్‌నాథ్ నిలదీశారు. మెడికల్ కాలేజీలు, భోగాపురం ఎయిర్‌పోర్టు ఎవరి హయాంలో నిర్మాణ పనులు జరిగాయని ప్రశ్నించారు. ఇన్ఫోసిస్ ఐటీ పరిశ్రమ ఎవరి హయాంలో వచ్చిందని ప్రశ్నించారు. మేం తీసుకొచ్చిన టీసీఎస్‌ను కూడా మీరే తీసుకొచ్చినట్లు చెప్పుకుంటున్నారని టీడీపీ నేతలపై మండిపడ్డారు. వైజాగ్‌లో ఐటీ రావడానికి వైఎస్ కుటుంబమే కారణమని స్పష్టం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రధాని మోదీతో నారా లోకేశ్ చెప్పించగలరా అని గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు. పుట్టని బిడ్డకు పేరు ఎలా పెడతరాని నారా లోకేశ్ అంటున్నారని గుర్తుచేశారు. మరి వైసీపీ హయాంలో వచ్చిన ప్రాజెక్టులు తమవని ఎలా చెప్పుకుంటారని మండిపడ్డారు.

## జనవరి 8న శ్రీశైలంలో పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం

స్వచ్ఛ శ్రీశైలం నిర్వహణలో భాగంగా ఈ నెల 8వ తేదీన పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర పరిధిలో విస్తృతంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టనున్నారు. ఈ విషయాన్ని శ్రీశైల ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు. దీనికోసం తగు ప్రణాళికను రూపొందించామని చెప్పారు. స్వచ్ఛ శ్రీశైలంలో భాగంగా క్షేత్రాన్ని 6 జోన్లుగా, 11 సెక్టార్లుగా, 68 ప్రదేశాలుగా విభజించడం జరిగిందన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి జోన్‌కు కూడా యూనిట్ అధికారులను, పర్యవేక్షకులను ప్రత్యేక అధికారులుగా నియమించామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా ఆయా జోన్లలో పలువురు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాడవీధులు, గంగాధర మండపం నుంచి తూర్పువైపున నందిగుడి వరకు గల ప్రదేశం దక్షిణం వైపున అలంకారేశ్వరాలయం గల ప్రదేశం, దర్శన క్యూకాంప్లెక్సు విరాళాల సేకరణ కేంద్ర ప్రాంగణం మరియు పరిసరాలు, అన్నప్రసాద వితరణ భవన పరిసరాలు, శ్రీలలితాంబికా వాణిజ్య సముదాయం, సీఆర్‌వో కార్యాలయ పరిసరాలు, దేవస్థానం వైద్యశాల పరిసరాలు, గంగాగౌరి సదన్ పరిసరాలు, మల్లికార్జున సదన్ పరిసరాలు, చల్లా వెంకయ్య సత్రం పరిసరాలు, గణేశసదన్ పరిసరాలు, టూరిస్ట్ బస్టాండ్ పరిసరాలు, సెంట్రల్ పార్కింగ్ ప్రదేశం, మల్లమ్మ కన్నీరు పరిసరాలు, పంచమఠాల పరిసరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిసరాలు, సర్వతోభద్రవన పరిసరాలు, కల్యాణకట్ట పరిసరాలు, పాతాళగంగ పాతమెట్ల మార్గం, ఆర్టీసి బస్టాండు, సిద్ధిరామప్ప వాణిజ్య సముదాయం, పాతాళగంగ మెట్ల మార్గం, పాతాళగంగ స్నానఘట్టాలు, భ్రమరాంబ అతిథి గృహ పరిసరాలు, శ్రీగిరి కాలనీ, కొత్తపేట అడ్డరోడ్లు, సాక్షి గణపతి ఆలయ పరిసరాలు, హాటకేశ్వరాలయ పరిసరాలు, ఫాలధార ? పంచధార, శిఖరేశ్వర ఆలయ పరిసరాలు మొదలైన చోట్ల పారిశుద్ధ్య చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

## ఏపీలో తుది ఓటర్ల జాబితాను ప్రకటించిన ఈసీ.. మొత్తం ఓటర్లు ఎంతంటే..

విజయవాడ, జనవరి 6, ఏపీలో సవరించిన తుది ఓటర్ల జాబితాను ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. ఆ జాబితా ప్రకారం 2025 జనవరి 1వ తేదీ నాటికి ఏపీలో మొత్తం 4,14,40,447 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 2,10,81,814 మంది పురుష ఓటర్లు, 2,02,88,549 మంది మహిళా ఓటర్లు ఉన్నారని ఎన్నికల సంఘం వెల్లడించింది. అలాగే 66,690 మంది సర్వీస్ ఓటర్లు, 3400 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని ఏపీ ఎన్నికల సంఘం తెలిపింది. ఈ మొత్తం ఓటర్లలో 18 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ఓటర్లు 5,14,646 మంది ఉన్నారు. ఇక రాష్ట్రంలో 46,397 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఎన్నికల సంఘం తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే 232 పోలింగ్ కేంద్రాలు పెరిగాయని పేర్కొంది. ముసాయిదా ఓటర్ల జాబితాను గత ఏడాది అక్టోబర్ 29వ తేదీన ఏపీ ఎన్నికల సంఘం ప్రకటించింది. ముసాయిదా జాబితాపై అదే ఏడాది నవంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరించింది. వచ్చిన అభ్యంతరాలకు పరిష్కారం చూపి సవరించిన తుది ఓటర్ల జాబితాను ఇవాళ ప్రకటించింది.



## రాష్ట్రంలో సుమారు 40 రైల్వే స్టేషన్ లు ఆధునీకరణ

### కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి

హైదరాబాద్,2021 నుంచి చర్లపల్లి అభివృద్ధి పనులు జరిగాయి. తెలంగాణ కు ఏది కావాలన్నా కేంద్రం సహాయం అందించింది. చర్లపల్లి అభివృద్ధి పనులపై నేను దాదాపు ఆరు సార్లు వచ్చి పర్యవేక్షించానని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ఈ స్టేషన్ అందుబాటులో ఉంటుంది. ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. చాలా రైళ్లు ఇక్కడి నుంచి నడుస్తాయి. ఎంఎంటీఎస్ రైళ్లు కూడా ఇక్కడి నుంచే ఘట్ కేసర్ వరకు వెళ్తాయని అన్నారు. 720 కోట్ల రూపాయలతో సికింద్రబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేస్తున్నాం. 1300 రైల్వే స్టేషన్ లు దేశ వ్యాప్తంగా అభివృద్ధి జరుగుతుంది. తెలంగాణ లో సుమారు 40 స్టేషన్ లు ఆధునీకరణ చేస్తోంది కేంద్రం. రైలు కూత వినిపించని ప్రాంతాలకు కూడా రైల్వే లైన్లు వేసి రైళ్ల సౌకర్యం కల్పిస్తుంది. రైళ్ళ ప్రమాదాలకు చెక్ పెట్టేలా కవచ్ తీసుకొచ్చాం. వందే భారత్ రైళ్లు 5 తెలంగాణ కు వచ్చాయి. వందే భారత్ స్లీపర్ రైళ్లు కూడా రాబోయే రోజుల్లో వస్తె బెంగులూరు కు వెళ్లే రైలు సౌకర్యం మరింత సులభం అవుతుంది. లక్ష కోట్లతో జాతీయ రహదారి విస్తరిస్తున్నాం. కాజీపేట లో రైల్వే మానుఫాక్చరింగ్ ఫ్యాక్టరీ పనులు జరుగుతున్నాయి. ఎంఎంటీఎస్ రైళ్ల కోసం 1000 కోట్లు గత రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని అడిగాం. మేము ఎన్నో సార్లు అడిగిన ఇవ్వలేదని అన్నారు. అయినప్పటికీ మేము ముందడుగు వేసి రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి.

# సంపాదకీయం

మంగళవారం 07-01-2025

## భారత్ లో తగ్గిన పేదరికం...

భారత్ అభివృద్ధి చెందుతున్న భారత్ కాదు.. ఇప్పుడు అభివృద్ధి చెందిన భారత్. కొన్నేళ్లపాటు భారత్ అభివృద్ధి చెందుతున్న దేశంగానే గుర్తింపు పొందింది. గతంలో ఎన్‌సీఏఈఆర్ ఓ నివేదిక విడుదల చేసింది. తాజాగా ఎస్‌బీఐ కూడా ఈమేరకు నివేదిక సమర్పించింది.దశాబ్దాల కాలంలో భారత్ పేద దేశంగా గుర్తింపు పొందింది. ఇప్పటికీ పిల్లలు భారత్ అభివృద్ధి చెందుతున్న దేశంగానే పరిగణిస్తున్నారు. నాలుగేళ క్రితం ప్రపంచాన్ని వణికించిన కరోనా కారణంగా చాలా మంది జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ ఇండియాఇర్వహించిన సర్వేలో భారత్‌లో పేదరికం గణనీయంగా తగ్గిపోయింది. మేరకు నివేదిక తాజాగాడుదల చేసింది. 2024లో దేశంలో పేదరిక రేటు 5 శాతం కంటే దిగువకు పడిపోవడంతో, ఎస్‌బిఐ అధ్యయనం కూడా దేశంలో తీవ్రమైన పేదరికం కనిష్టస్థాయికి తగ్గినట్లు స్పష్టం చేసింది. ఇది "సమగ్ర స్థాయిలో" భారతదేశంలో పేదరికం రేట్లు ఇప్పుడు 4-4.5 శాతం పరిధిలో ఉండవచ్చు. భావిస్తున్నాం. దీంతో దాదాపు తీవ్రమైన పేదరికం అత్యల్ప స్థాయిలో ఉంది అని అధ్యయనం పేర్కొంది.కుటుంబాల వినిమయ వ్యయం సర్వే (హెచ్‌సిఇఎస్) నివేదిక ఆధారంగా గత కొన్నేళ్లలో గ్రామీణ, పట్టణ పేదరిక స్థాయిలలో గణనీయమైన తేడాలు వచ్చాయని ఎస్‌బిఐ సర్వే హైలెట్ చేసింది. సర్వే ప్రకార గ్రామీణ పేదరికం 2024 ఆర్థిక సంవత్సరంలో 4.86 శాతంగా అంచనా వేయగా, ఇది 2023 ఆర్థిక సంవత్సరంలో 7.2 శాతంగా, 2012 ఆర్థిక సంవత్సరంలో 25.7 శాతం కంటే గణనీయంగా తగ్గింది. గడిచిన 12 ఏళ్ల క్రితం భారత్‌లో పేదరికం 21.2 శాతంగా ఉందని.. అది 2022?24 నాటిక ఏకంగా 12.7 శాతం మేర పడిపోయి 4.86 శాతానికి తగ్గినట్లు తెలిపింది. 2022? 24 లో దేశంలో పేదరికం 4.86 శాతంగా నమోదైనట్లు తెలిపింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సర్వే ప్రకారం.. ఈ వేవ్ 3 సహా వేవ్ 1, వేవ్ 2 సమాచారాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు సర్వే తెలిపింది. ఎస్‌బీఐ నివేదిక ప్రకారం దేశంలో 2004?05 మధ్య పేదరికం 38.6 శాతంగా ఉంది. ఇక 2011? 12 నాటికి అది 21.2 శాతానికి పడిపోయింది. తర్వాత పలు సవాళ్లు ఎదురయ్యాయి. కోవిడ్ విజృంభించడం, ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా గ్రామీణ వ్యసాయంపై కరోనా ప్రభావంత అంతగా లేదు. దీంతో పేదరిక 2022?24 నాటికి 4.86 శాతానికి తగ్గిందని వెల్లడించింది.ఇక ఇటీవల నీతి ఆయోగ్ నిర్వహించిన సర్వే కూడా దేశంలో పేదరికం 5 శాతం తగ్గినట్లు తెలిపింది. నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యన్ నిర్వహించిన వినియోగదారు వ్యయు సర్వే తెలిపింది. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణం పెరుగుతుందని పేర్కొంది. పట్టణ గ్రామీణ ప్రాంతాలు సుభిక్షంగా మారుతున్నాయని పేర్కొంది. ఇండియా హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే (ఐహెచ్‌డీఎస్) ఇటీవల పూర్తి చేసిన వేవ్ 3 సహా వేవ్ 1, వేవ్ 2 సమాచారాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు సర్వే తెలిపింది. ఐహెచ్‌డీఎస్ నివేదిక ప్రకారం దేశంలో 2004- 05 మధ్య పేదరికం 38.6 శాతంగా ఉంది. అది 2011- 12 వచ్చే నాటికి 21.2 శాతానికి పడిపోయింది. ఆ తర్వాత పలు సవాళ్లు ఎదురయ్యాయి. కోవిడ్ మహమ్మారి విజృంభించి ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపింది. అయితే అలాంటి సవాళ్లు ఎదురైనా 2011-12 నుంచి చూసుకుంటే 2022- 24 వచ్చే నాటికి దేశంలో పేదరికం 8.5 శాతానికి పరిమితమైనట్లు నివేదిక తెలిపింది.అలాగే నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీసుల లెక్కల ప్రకారం కుటుంబ వినియోగ ఖర్చు 2011?12తో పోలిస్తే దారిద్ర్య రేఖను గ్రామీణ ప్రాంతాల్లో రూ.447గా నిర్ణయించగా, పట్టణ ప్రాంతాల్లో రూ.579గా నిర్ణయించారు. 2004?05 మధ్య ఈ రేఖను రాష్ట్రాల వారీగా మార్చారు. 2011?12 నాటి ప్రణాళిక సంఘం ఈ విలువను రూ.860, రూ.1000 గా మార్చింది.గ్రామీణ పేదరికం తగ్గడానికి ఎస్‌బీఐ కొన్ని కారణాలను తెలిపింది. పేదలకు ప్రభుత్వం మద్దతు తెలిపింది. అదే విధంగా డీబీటీ, ప్రభుత్వ మద్దతు ధరల్లో మార్పు, మౌలిక సదుపాయాలు, జీవనోపాధి, రైతుల ఆదాయం పెంచడం వంటి కారణాలతో గ్రామీణ పేదరికం తగ్గినట్లు వివరించింది. ప్రభుత్వాలు కూడా పేదలకు సంక్షేమం కోసం పని చేస్తుండడం, విరివిగా రుణాలు అందిస్తుండడం కారణంగా కూడా పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని వెల్లడించింది. నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యన్ నిర్వహించిన వినియోగదారు వ్యయ సర్వే తెలిపింది. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణం పెరుగుతుందని పేర్కొంది. పట్టణ గ్రామీణ ప్రాంతాలు సుభిక్షంగా మారుతున్నాయని పేర్కొంది. అలాగే నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీసుల లెక్కల ప్రకారం కుటుంబ వినియోగ ఖర్చు 2011-12తో పోలిస్తే దారిద్ర్య రేఖను గ్రామీణ ప్రాంతాల్లో రూ.447గా నిర్ణయించగా, పట్టణ ప్రాంతాల్లో రూ.579గా నిర్ణయించారు. 2004-05 మధ్య ఈ రేఖను రాష్ట్రాల వారీగా మార్చారు. 2011-12 నాటి ప్రణాళిక సంఘం ఈ విలువను రూ.860, రూ.1000 గా మార్చింది. మరో వైపు దేశాభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని.. అటువంటి గ్రామాల అభివృద్ధిని గత ప్రభుత్వాలు విస్మరించాయని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఢిల్లీలో నిర్వహిం చిన గ్రామీణ భారత మహోత్సవం 2025 కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెనుకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని.. దాంతో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు ఎక్కువయ్యాయన్నారు. ఫలితంగా పట్టణాల్లోనూ పేదరికం పెరిగిందని ప్రధాని వాపోయారు. సమాజంలో ఎన్ని మార్పులు వస్తున్నా గ్రామాలకు, పట్టణాలకు మధ్య అంతరం పెరుగుతూనే ఉన్నదని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు.దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలు ప్రస్తుతం తమ పాలనలో సమాన హక్కులు పొందుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

## ప్రతి అర్జీని క్షుణ్ణంగా చదవండి---

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి--**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్న ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన అర్జీలు అర్జీలను క్షుణ్ణంగా చదివి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అర్జీదారునికి సరైన ఎండార్స్మెంట్ ఇస్తూ రసీదు పొందాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదులు రీఓపెన్ కావడానికి గల కారణాలకు సంబంధించి దాదాపు పది అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. 24 గంటల లోపల పరిష్కరించాల్సిన మూడు ఫిర్యాదులు, 34 రీఓపెన్ అయిన ఫిర్యాదులు,



20 సీఎంఓ కార్యాలయపు ఫిర్యాదులు, ఇంకా బియాండ్ ఎస్ఎల్ఏ లో ఉన్న అర్జీలపై తక్షణమే స్పందించి క్లియర్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డీఈఓ కార్యాలయానికి సంబంధించి 24 గంటల నుండి 48 గంటల లోపల ఉన్న పెండింగ్ దరఖాస్తులన్నీ ఈరోజే క్లియర్ చేయాలని లేని పక్షంలో బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్తాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇంకా ఎంప్లాయిస్ హౌస్ హోల్డ్ డేటాలో 93 వేల మంది నమోదు కాలేదని, నంద్యాల పట్టణంలోనే 21 వేల మంది ఉన్నారని ఆధార్ లింక్ చేసి హౌస్ హోల్డ్ డేటాలో నమోదు కావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ మాట్లాడుతూ బండి ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, బనగానపల్లి, సంజామల మండలాలలో పెండింగ్ లో ఉన్న ఫ్రీ హోల్డ్ భూముల డేటాను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని ఆర్డీఓ, సంబంధిత తాసిల్దార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 170 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## మాధవీలత కన్నీరు

గుంటూరు, జనవరి 6, టాలీవుడ్ హీరోయిన్ మాధవీలత ఇప్పుడు సినిమాల కంటే ఎక్కువగా రాజకీయాల్లో యాక్టివ్ గా ఉంటున్న సంగతి తెలిసిందే. బీజేపీ నాయకురాలైన ఆమె తరచుగా వివాదాస్పద అంశాలతో వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. సినిమా ఇండస్ట్రీలో మాత్రమే కాదు, సమాజంలో జరిగే ఇతర విషయాలపై కూడా రెస్పాండ్ అవుతూ తన అభిప్రాయాన్ని కుండ బద్దలు కొడుతుంది. అయితే రెండ్రోజుల క్రితం ఆమె జేసి ప్రభాకర్ రెడ్డిపై చేసిన కామెంట్స్ రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. దీంతో ఆయన కూడా మాధవీలతపై షాకింగ్ కామెంట్స్ చేయడంతో, ఇద్దరి మధ్య మాటల యుద్ధం ముదిరింది. చివరికి ఆయన తప్పయింది అంటూ సారీ చెప్పినప్పటికీ, ఈ వివాదం శాంతించినట్టుగా కనిపించట్లేదు. తాజాగా మాధవీలత షేర్ చేసిన మరో వీడియో వైరల్ అవుతుంది.తాజాగా మాధవీలత బోరున విలపిస్తూ ఓ వీడియోను ఫేస్ బుక్ లో షేర్ చేశారు. ఇక ఆ వీడియోకి సుదీర్ఘ నోట్ రాసి తన మనసులోని ఆవేదనను బయట పెట్టింది. ఆ నోట్ లో "ఎమోషనల్ అవ్వకుండా ఉండడానికి చాలా ప్రయత్నించాను. కానీ నేను కూడా మనిషినే కదా? నా ఆత్మగౌరవం మీద జరిగిన దాడి వల్ల కలిగిన బాధను వర్ణించడానికి పదాలు లేవు. ప్రతిక్షణం వేదన, దుఃఖం, నిరాశ, కోపం... అన్నీ నన్ను ఒక్కసారిగా కుదిపేస్తున్నాయి. నా ఆత్మవిశ్వాసాన్ని చిదిమేయాలని ఎన్నోసార్లు ఎంతమందో ప్రయత్నించారు. పదేపదే ఇలాంటి మాటలు అన్నారు. నా పార్టీ కోసం, హిందూ ధర్మం కోసం, మహిళల కోసం... నిస్వార్థంగా నా వంతుగా నేను పోరాడుతున్నాను. ఎవరికి ద్రోహం, మోసం చేసింది లేదు. ఒకరి దగ్గర ఒక్క పైసా తీసుకున్నది లేదు. కానీ నాపై కక్ష కట్టి ఇలాంటి మాటలు అంటున్నారు. ఒక ఆడపిల్లగా నేను ఎప్పుడూ సింపతి గేమ్ ఆడలేదు. అలాగే మగాడిలా పోరాడుతున్నాను. త్వరలోనే ఈ కష్టాలను అధిగమిస్తాను. నాకు సపోర్ట్ గా నా ఫ్యామిలీ, ఫ్రెండ్స్, అభిమానులు, సోషల్ మీడియాలో నన్ను ఫాలో అవుతున్న ఎంతోమంది శ్రేయోభిలాషులు ఉన్నారు. నా బాధను మీతో పంచుకున్నందుకు క్షమిస్తారని ఆశిస్తున్నాను" అంటూ మాధవీలత కంటతడి పెట్టుకున్న వీడియోని షేర్ చేసింది.2025 న్యూ ఇయర్ సందర్భంగా జేసీ ప్రభాకర్ రెడ్డి తాడిపత్రిలో మహిళలకు మాత్రమే ఒక ఈవెంట్ ను ఏర్పాటు చేశారు. అయితే ఈవెంట్ కి మహిళలు వెళ్లొద్దంటూ మాధవీలత ఓ షాకింగ్ వీడియోని రిలీజ్ చేసింది. అందులో జేసీ పార్క్ లో గంజాయి బ్యాచ్ లు ఉంటాయని హెచ్చరిస్తూ, దాడులు చేస్తే ఎవరిది బాధ్యత? అని ప్రశ్నించింది. అందుకే ఆడపిల్లలు ఇంట్లోనే సెలబ్రేట్ చేసుకోండి అంటూ ఆ వీడియోలో మాధవీలత చెప్పింది. దీంతో జేసీ ప్రభాకర్ రెడ్డి ఈ విషయంపై సీరియస్ అవుతూ, ఘాటుగా సమాధానం ఇచ్చారు. కానీ మాధవీలత చేసిన వ్యాఖ్యల కంటే, ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తడంతో "ఆవేశంలో అన్నాను. క్షమించండి" అంటూ ఆయన దిగివచ్చారు. ఈ నేపథ్యంలోనే మాధవీలత ఏడుస్తూ కొత్త వీడియోను రిలీజ్ చేసింది.

## మహాకుంభమేళకు అంతా సిద్ధం



లక్నో, జనవరి 6, (న్యూస్ పల్స్) మహా కుంభ మేళా 2025 హిందువులు దీనిని ఎంతో ఘనంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ సంవత్సరం 2025లో కుంభమేళా జనవరి 13వ తేది నుంచి ఫిబ్రవరి 26వ తేదివరకు అలహాబాద్ (ప్రయాగ)లో జరగనుంది. అయితే అసలు ఈ కుంభ మేళాను ఎందుకు నిర్వహిస్తారు అమృతాన్ని గెలుచుకునేందుకు దేవతలు, అసురల సముద్ర మథనం చేస్తారు. ఆ సమయంలో ప్రయాగ్ రాజ్, హరిద్వార్, నాసిక్, ఉజ్జయిని నదులపై అమరత్వాన్ని ఇచ్చే అమృతం పడిందని చెప్తారు. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం, నక్షత్రాల స్థానం ప్రకారం.. కుంభ మేళా సమయంలో ఆ పవిత్ర నదుల నీరు అమృతంగా మారుతుందని భక్తులు భావిస్తారు. అందుకే ఈ కుంభ మేళా సమయంలో హిందువులు తమ పాపాలను పోగొట్టుకోవడానికి పవిత్ర నదుల వద్దకు వెళ్తూ ఉంటారు. కుంభ అంటే సంస్కృతంలో కుండ, కలశం అనే అర్థాలను ఇస్తుంది. అలాగే రాశుల్లో కూడా కుంభ రాశి ఉంటుంది. ఈ రాశిలోనే కుంభ మేళాను నిర్వహిస్తారు. మేళా అంటే జన సమూహం, కూటమి, జాతరను సూచిస్తుంది. పవిత్ర నదుల దగ్గర ఇలా కూటమిగా రావడాన్నే కుంభ మేళాగా పిలుస్తున్నారు. సాధారణంగా కుంభ మేళా అనేది ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. అర్ధ కుంభ మేళా అనేది ప్రతి ఆరు సంవత్సరాలకు చేస్తారు. హరిద్వార్, ప్రయాగలలో ఈ అర్ధ కుంభ మేళా జరుగుతుంది. పూర్ణ కుంభ మేళా అనేది ప్రతి పన్నెండు సంవత్సరాలకు చేస్తారు. ప్రయాగ, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్లలో ఈ పూర్ణ కుంభ మేళా జరగుతుంది. ఇలాంటి పూర్ణ కుంభ మేళాలు పన్నెండు పూర్తి అయిన తర్వాత అంటే నూట నలభై నాలుగు సంవత్సరాలకు ఓసారి మహా కుంభ మేళా జరుగుతుంది. ఇది అలహాబాద్లో నిర్వహిస్తారు. ఇప్పుడు జరిగేది మహా కుంభ మేళానే. దీనిని అలహాబాద్గా చెప్తోన్న ప్రయాగ్లో నిర్వహిస్తున్నారు. సూర్యుడు, బృహస్పతి గ్రహం స్థానాల ఆధారంగా కుంభ మేళాను నిర్వహిస్తారు. సూర్యుడు, బృహస్పతి సింహ రాశిలో ఉన్నప్పుడు కుంభ మేళాను నాసిక్లోని త్రయంబకేశ్వర్లో నిర్వహిస్తారు. సూర్యుడు మేష రాశిలో ఉన్నప్పుడు హరిద్వార్లో చేస్తారు. బృహస్పతి, సూర్యుడు వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు ఉజ్జయినిలో నిర్వహిస్తారు. ఇలా ప్రతి స్థలంలోనూ కుంభ మేళా నిర్వహించే తేదీలను సూర్యుడు, బృహస్పతి స్థానాల ఆధారంగా లెక్కిస్తారు.

## హౌసింగ్ బోర్డ్ కాలనీ నివాసతుల స్థలాలకు భద్రత--

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 06 - హౌసింగ్ బోర్డ్ కాలనీలోని నివాసితుల స్థలాల భద్రతకు భరోసా కల్పిస్తూ జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఉత్తర్వుల ప్రతులను పంపిణీ చేశారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ లో భాగంగా నంద్యాల పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ నివాసుల స్థలాల భద్రత ఉత్తర్వుల ప్రతులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పంపిణీ చేశారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ హౌసింగ్ బోర్డులోని సర్వే నంబర్లు 2317, 2319, 2320, 2315, 2313 లలోని 49.40 ఎకరాలలోని 537 ప్లాట్ కు సంబంధించిన ప్లాట్లకు హౌసింగ్ బోర్డ్ నంబర్లు వేసుకొని భూ ఆక్రమణదారులు విక్రయాలు జరిపారన్నారు. ఇందుకు సంబంధించి వార్తాపత్రికలలో ప్రతికూల వార్తలు రావడంతో హౌసింగ్ బోర్డు కాలనీలోని సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో ఉంచారన్నారు. వీటన్నింటిని సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, మండల తాసిల్దార్ నుండి రికార్డులు తెప్పించుకొని సమగ్ర విచారణ జరిపి కలెక్టరేట్లోని సెక్షన్ సూపర్డెంట్, సిబ్బంది, జాయింట్ కలెక్టర్ ప్రతిపాదనల మేరకు సంబంధిత కాలనీవాసులకు నిషేధిత జాబితా నుండి తొలగిస్తూ తదుపరి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించుకునేందుకు ఉత్తర్వులను జారీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## తొక్కుడు బిళ్ల ఆడే ఈ ముఖ్యమంత్రికి.. ఫార్ములా-ఈ రేస్ గురించి ఏం తెలుసు? : క్రిశాంక్

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ఫైర్ అయ్యాడు. తొక్కుడు బిళ్ల ఆడే ఈ ముఖ్యమంత్రికి ఫార్ములా-ఈ రేస్ గురించి ఏం తెలుసని ఘాటుగా విమర్శించారు. ఫార్ములా-ఈ రేస్ కేసులో ఏసీబీ అధికారులు సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించారని ఆరోపించారు. సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని విచారణకు పిలిచినప్పుడు న్యాయవాది పక్కన ఉండొచ్చన్నారు. న్యాయవాదిని తీసుకుపోతాను అని కేటీఆర్ అంటే ఏసీబీ వాళ్లు ఎందుకు అంత డ్రామా చేశారని సూటిగా ప్రశ్నించారు.న్యాయవాది లేకపోతే ఏసీబీ వాళ్లు పట్నం నరేందర్ రెడ్డి కేసు లాగే వాళ్లకు నచ్చిన స్టేట్మెంట్ రాసుకుంటారని క్రిశాంక్ అన్నారు. అంతే కాకుండా కేటీఆర్ విచారణకు సహకరించలేదని కోర్టుకు చెప్పే అవకాశం ఉందన్నారు. అసలు ఈ కేసులో క్రిమినల్ మోటివ్ ఏంటి? ఫార్ములా-ఈ వాళ్లను ఇక్కడికి తీసుకురావడం నేరమా? కశ్మీర్‌కు మోటార్ స్పోర్ట్స్ తీసుకువచ్చామని ప్రధాని మోదీ, అమిత్ షా చాలా గొప్పగా చెప్పుకున్నారు. వాళ్లకు గొప్ప అయింది మనకు గొప్ప కాదా? అని నిలదీశారు. హైదరాబాద్ నగరానికి మొదటి సారి ఫార్ములా- ఈ రేస్ రావటం గొప్ప కాకుండా పోతుందా అని ప్రశ్నించారు.తొక్కుడు బిళ్ల ఆడే ఈ ముఖ్యమంత్రికి.. ఫార్ములా-ఈ రేస్ గురించి ఏం తెలుసు.. నువ్వు ఒక్క కంపెనీ కూడా తేలేదు కాబట్టి ఇవాళ నీ పేరు కూడా ఎవరు గుర్తుపెట్టుకోవడం లేదన్నారు. అప్పులు అని అంటున్నారు. అప్పుల గురించి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చెప్పింది తీసుకోవాలా ? రేవంత్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెప్పింది తీసుకోవాలా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చాలా మంచి నటుడు, చాలా బాగా అబద్ధాలు చెప్తాడని విమర్శించారు.

## బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎవరు..

హైదరాబాద్, జనవరి 6, (న్యూస్ పల్స్)తెలంగాణ బీజేపీలో రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కొత్త అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తారు? ఈ నియామకం ఎప్పుడు జరుగుతుంది? అనేది ఆశావహులతో పాటు బీజేపీ సీనియర్ నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా మరోవైపు తెలంగాణ బీజేపీ స్టేట్ ఇంఛార్జ్ సునీల్ బన్సల్ స్వయంగా రంగంలోకి దిగడం ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ క్రమంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సునీల్ బన్సల్ ఆ పార్టీ నేతలతో భేటీ కానున్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో పాటు బీజేపీ నేతలతో సునీల్ బన్సల్ వరుసగా భేటీ కావడం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై ఆసక్తిని రేపుతోంది. తెలంగాణలో బీజేపీ గెలుపే లక్ష్యంగా జాతీయ నాయకత్వం ప్రణాళికలు రచిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జాతీయ నాయకత్వం యోచిస్తోంది.ఆదివారం ఉదయం నుండి కూడా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్.. వరుసగా తెలంగాణ బీజేపీ నేతలతో సమావేశం అవుతున్నారు. జాతీయ నాయకత్వం స్వయంగా తెలంగాణపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. బూత్ కమిటీల నుండి రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక వరకు పూర్తిగా తమ కనుసన్నల్లోనే నియామకం జరిగే విధంగా ప్రణాళికలు రచించారు. ఇప్పటికే బూత్ కమిటీలు పూర్తవగా, మండల కమిటీలు దాదాపుగా అన్ని జిల్లాల్లో పూర్తి కావస్తోంది. జిల్లా కమిటీలు కూడా నియమించుకోనున్నారు.గత మూడు రోజులుగా జిల్లాలకు వెళ్లి రాష్ట్ర నాయకత్వం అక్కడ మండల కమిటీలను పూర్తి చేసింది. జిల్లా అధ్యక్షుల ఎంపికపైన కూడా కసరత్తు నడుస్తోంది. ఇదే అంశంపై సునీల్ బన్సల్ ఆయా జిల్లాల ముఖ్య నేతలతో సమావేశం అవుతున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎవరైతే బాగుంటుంది అనే అంశంపై అభిప్రాయాలు సేకరణ చేస్తున్నారు. ప్రతి జిల్లా నుంచి మూడు పేర్లు తీసుకుని, జిల్లా అధ్యక్షుడిగా ఒకరిని ఫైనల్ చేయనున్నారు.వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ.. అందుకు అనుగుణంగా సంస్థాత నిర్మాణం మొదలు పెట్టింది. ముఖ్యంగా 2025లో తీసుకునే నిర్ణయాలు వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో.. కచ్చితమైన నిర్ణయాలు తీసుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది బీజేపీ అగ్ర నాయకత్వం.

## గ్రామాల్లో పగలు, ప్రతీకార రాజకీయాలు

కాకినాడ, జనవరి 6, రాజకీయాలకు అర్థం మారిపోయింది. ఇప్పుడంతా వ్యక్తిగత స్వార్థం పనిచేస్తోంది. నేతలు తమ స్వప్రయోజనాల కోసం పార్టీలను మార్చేస్తున్నారు. ఇటువంటి సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ ఆధిపత్యం పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఏపీలో రాజకీయ పగ, ప్రతీకారాలు కొనసాగుతున్నాయి. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రత్యర్థులను దారుణంగా భయపెట్టారు. భయాందోళనకు గురి చేశారు. స్థానిక సంస్థలను సైతం ఏకపక్షంగా కైవసం చేసుకున్నారు. అయితే కాలం ఒకేలా ఉండదు. వైసీపీ ప్రభుత్వం పై వ్యతిరేకత ఏర్పడింది. ప్రతిపక్షాలు కూటమికట్టాయి. ఘనవిజయం సాధించాయి. అయితే వైసీపీకి ఓటమి ఎదురు కావడంతో ఆ పార్టీకి చెందిన నేతలు గుడ్ బై చెబుతున్నారు. కూటమి పార్టీల్లో చేరుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా వైసీపీ హవా నడుస్తోంది. దానికి కారణం స్థానిక సంస్థలు వారి చేతుల్లోనే ఉండడం. సాధారణంగా పెద్ద నేతలు పార్టీలు మారుతుంటారు. వారు వెళ్లిపోయినంత సులువుగా కిందిస్థాయిలో ఉన్న నేతలు మాత్రం.. పార్టీలు మార్చేందుకు ఇష్టపడరు. వారు ఆరు నూరైనా.. నూరు ఆరైనా సొంత పార్టీలోనే కొనసాగేందుకు ఇష్టపడతారు. పెద్ద పెద్ద నాయకులు.. వందల కోట్ల రూపాయలు లబ్ధి పొందిన వారు సైతం రాత్రికి రాత్రే పార్టీ మార్చేస్తున్నారు. కానీ దిగువ స్థాయిలో మాత్రం ఇంకా మొండి పట్టుదల కొనసాగుతోంది. ఈ క్రమంలో పగలు, ప్రతీకార రాజకీయాలు తెరపైకి వస్తున్నాయి. తాజాగా కాకినాడ జిల్లా కాజులూరు మండలంలోని ఉప్పు మిల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఏడు కుటుంబాలను గ్రామ పెద్దలు వెలివేశారు. గ్రామస్తులు వారికి ఎలాంటి సహకారం అందించకూడదని.. వారి శుభకార్యాలకు పిలిచిన వెళ్ళకూడదని ఆదేశాలు ఇచ్చారు. దీంతో వీరంతా గ్రామం వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురైంది. వైసీపీ ప్రభావం ఎక్కువగా ఉండే గ్రామం కావడంతో గ్రామ పెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. బాధిత కుటుంబాలు కాకినాడ కలెక్టరేట్లో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చిందిఈ ఘటనపై కాకినాడ కలెక్టర్ స్పందించారు. క్షేత్రస్థాయిలో అధికారులను గ్రామానికి పంపించారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇది ఇలా ఉంటే అధికార పార్టీకి మద్దతుగా ఉన్న కుటుంబాలను ఎలా బహిష్కరించారని అంశం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. దీని వెనుక ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? తెర వెనుక ఏం జరిగిందనేది ఆరా తీస్తున్నారు అధికారులు. పెద్ద పెద్ద నాయకులే పార్టీ మారిపోతున్న ఈ పరిస్థితుల్లో.. గ్రామీణ ప్రాంతాల్లో ఈ వివక్ష, వెలివేసే రుగ్మత కొనసాగుతుండడం విచారకరం.

## ఆరోగ్యశ్రీ స్థానంలో ఇన్సూరెన్స్...

విజయవాడ, జనవరి 6, ఆరోగ్యశ్రీ కన్నా మెరుగైన హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తుంది కూటమి ప్రభుత్వం చెబుతోంది. అయితే ఆరోగ్య శ్రీ కంటే ఎలా మెరుగైందో చెప్పాలంటూ విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఆరోగ్య శ్రీ వల్ల ప్రభుత్వ ఖజానా పై భారం పడుతుంది. ప్రయివేటు ఆసుపత్రులకు కోట్ల రూపాయల నిధులను చెల్లించాల్సివస్తుంది. ఏటా వందల కోట్ల రూపాయలు దీనికి ఖర్చు చేయాల్సి వస్తుంది. అందుకే దీనికి విరుగుడుగా ఆరోగ్య శ్రీని ఎత్తివేసి ఎన్టీఆర్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలుచేయాలన్న ఆలోచనను చేస్తుంది. అయితే దీనిని ప్రయివేటు ఆసుపత్రులతో పాటు బీమా కంపెనీలు కూడా ఏ మేరకు సహకరిస్తాయన్నది మాత్రం అనుమానంగానే ఉంది. సహజంగా బీమా అంటేనే పూర్తి స్థాయిలో డబ్బులు రావు.అయితే బీమా సౌకర్యం ఉంటే ముందు చికిత్స ప్రారంభిస్తారు. అలాగే ఆరోగ్య శ్రీ కార్డు ఉన్నప్పటికీ అదే తరహాలో చికిత్సను ప్రారంభిస్తారు. అయితే ఆరోగ్య శ్రీ కింద చికిత్స అందితే ఆ సొమ్మును ప్రభుత్వం ఆ ఆసుపత్రికి అందచేయాల్సి ఉంటుంది. ఆరోగ్య శ్రీ పథకం దుర్వినియోగం అయినట్లు కూడా అనేక వార్తలు వచ్చాయి. వైద్యం అందించకుండానే దొంగ బిల్లులు పెట్టి అనేక ఆసుపత్రులు ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నట్లు గతంలో ఆరోపణలు వినిపించాయి. దీనిని అరికట్టేందుకు బీమా సౌకర్యం ఒకరకంగా మేలు చేస్తుందన్నది వాస్తవమే. ఎందుకంటే బీమా కంపెనీలు కేవలం ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తే చాలు వైద్యానికి అయ్యే ఖర్చులో కొంత మొత్తాన్ని చెల్లిస్తుంది. దాదాపు ఎనభై శాతం డబ్బులు చెల్లించే బీమా కంపెనీలున్నాయి. అయితే కొన్ని రకాల వ్యాధులకు మాత్రమే బీమా సౌకర్యం లభిస్తుంది. ఆసుపత్రి యాజమాన్యాలు ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టం చేయడం కూడా ఒకింత ఆందోళన కలిగిస్తుంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు ఒక కోటి 43 లక్షల కుటుంబాలు ఉన్నాయి వీరందరి తరుపున కూటమి ప్రభుత్వమె హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం కడుతుంది. ఒక్కొక్క కుటుంబానికి ఏడాదికి 2.5 లక్షల వరకు లబ్ది చేకూరుతుంది .అంతకు మించితే ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా మిగిలిన మొత్తం చెల్లిస్తుంది. దీని వల్ల లబ్దిదారుడికి ఒక్క రూపాయి కూడా అదనంగా పడదని చెబుతుంది. ప్రైవేట్ గా హెల్త్ ఇన్సూరెన్స్ కట్టేవారికి ఇటువంటి సదుపాయాలు వస్తాయో అంతకుమించి ప్రయోజనాలు కూటమి ప్రభుత్వం కలిస్తుంది. గత ప్రభుత్వంలో వైద్యం కోసం ఆరోగ్యశ్రీ కి సంబంధించిన నెట్ వర్క్ హాస్పిటల్స్ కి వెళ్తే చికిత్స అంత తొందరగా చేసేవారు కాదు ప్రభుత్వం నుంచి వారికి డబ్బులు అంతో ఇంతో పడితేనే చికిత్స చేసేవారు ఈ విధానినికి స్వస్తి చెప్పామని కూటమి ప్రభుత్వం చెబుతోంది.. ప్రజలకు కావాల్సింది మెరుగైన వైద్యం, విద్య ఇవ్వన్నీ కూటమి ప్రభుత్వం చేస్తుందని అధికార పార్టీ చెబుతున్నప్పటికీ బీమా అనగానే ప్రజల్లో ఒకరకమైన ఆందోళన నెలకొంది. దీంతో పాటు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో కొన్ని బీమా కంపెనీలకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఇలా బీమా సౌకర్యం ఏర్పాటు చేయడంలోనూ అనేక ఇబ్బందులున్నాయి. బీమా మొత్తం కంపెనీ చెల్లించడానికి నిరాకరిస్తే ఆ మొత్తాన్ని ఆసుపత్రి యాజమాన్యం రోగి బంధువుల నుంచి వసూలు చేసే అవకాశాలు లేకపోలేదంటున్నారు. మొత్తం మీద ఆరోగ్య శ్రీని ఎత్తివేసి దాని స్థానంలో బీమా సౌకర్యం కల్పించడంలో కొంత సర్కార్ ఖజానాకు చిల్లు పడే అవకాశం తప్పుతున్నా ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పవని వైద్యులు చెబుతున్నారు. దీనిని అమలు చేస్తే గాని దానిలోని లోపాలు, లొసుగులు బయటకువచ్చే అవకాశం లేదు.

## భక్తులపై దూసుకెళ్లిన 108 అంబులెన్స్

### ఇద్దరు మృతి .... ముగ్గురికి గాయాలు

తిరుపతి ఒక అంబులెన్స్ అదుపు తప్పి భక్తులపై దూసుకుపోయింది. ఘటనలొఓ ఇద్దరు మృతి చెందారు. ముగ్గురికి గాయాలయ్యాయి.చంద్రగిరి మండలం నరశింగాపురం నారాయణ కళాశాల వద్ద ఘటన జరిగింది. మృతి చెందిన వ్యక్తులు అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చెంపాలపల్లికి చెందిన పెద్దరెడ్డమ (40), శేగంవారిపల్లికి చెందిన లక్ష్మమ్మ (45) గా గుర్తించారు. అంబులెన్స్ లో మదనపల్లి నుంచి తిరుపతి రూయా ఆసుపత్రికి రోగిని తీసుకొస్తున్నారు. బాధిత భక్తులు పుంగనూరు నుంచి తిరుమల కు పాదయాత్ర చేస్తున్నారు.

# సంక్రాంతికి సిద్ధమౌతున్న బరులు



ఏలూరు, జనవరి 6,సంక్రాంతి అంటే ఆంధ్రప్రదేశ్ లో కోడిపందేలు గుర్తుకు వస్తాయి. ఏపీలో సంక్రాంతి అంటే కోడి పందేలు లేకుండా జరగవు. అప్పుడే పందెం కోళ్లు రెడీ అయిపోయాయి. బరులు కూడా సిద్ధమవుతున్నాయి. గ్రామ స్థాయిలో ఉన్న నేతల నుంచి ఎమ్మెల్యేల వరకూ సొంత బరులను ఏర్పాటు చేసుకుని కోడిపందేలను నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. సంక్రాంతి అంటేనే ఆంధ్రప్రదేశ్ లో పెద్ద పండగ. మూడు రోజుల పాటు జరిగే ఈ పండగలో అనేక విశిష్టతలున్నప్పటికీ సంక్రాంతి సంబరాల్లో ముఖ్యంగా గుర్తుకొచ్చేది కోడి పందేలు. పందె కోళు కాలు దువ్వుతుంటే మీసం మీద మెలేసిన చేయి దించకుండా ఎన్నికల్లో గెలిచినట్లే ఫీలవుతారు చాలా మంది. కోడి పందేలు లేకుండా పండగ లేదు. పండగ అంటేనే కోడి పందేలు అనే రకంగా మారింది. కోడిపందేలకు ఉభయ గోదావరి జిల్లాల ప్రసిద్ధి. ప్రత్యేకంగా ఇందుకోసం బరులను తయారు చేస్తారు. ఎలా ఉంటాయంటే.. ఖరీదైన కార్లు.. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ ఈ కోడిపందేలకు హాజరవుతారు. కేవలం ఏపీ నుంచి మాత్రమే కాదు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో ఉన్న వారితో పాటు విదేశాల్లో ఉన్న తెలుగు వాళ్లు సయితం కోడిపందేలు చూసేందుకు తరలి వస్తారు. కోడిపందేలు చూడకపోతే పండగ సక్రమంగా జరగనట్టేనని భావిస్తారు. అందుకే సంక్రాంతి పండగ వేళ జరుగుతున్న కోడి పందేల కోసం వేల సంఖ్యలో జనం ఎదురు చూస్తుంటారు. కోడి పందేల కోసం ఏడాదంతా కోడి పుంజులను బరిలోకి దింపేందుకు సన్నద్ధం చేస్తుంటారు. వాటికి బలిష్టమైన ఆహారం ఇవ్వడంతో పాటు వివిధ రకాల ఎక్సర్‌సైజులు కూడా చేయిస్తారు. స్విమ్మింగ్ కూడా చేయిస్తారు. పందెం కోళ్లను సిద్ధం చేయడానికి ప్రత్యేకంగా కొందరిని నియమించుకుంటారు. వేల రూపాయలు జీతాలిచ్చి వీరిని అందుకోసమే వినియోగిస్తారు.. ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే కోడి పందేలలో కోట్లాది రూపాయలు చేతులు మారతాయి. కేవలం డబ్బులే కాదు... గెలిచి వచ్చిన కోడిని ఊరేగింపుగా తీసుకెళ్లి తన ఇంట్లో మనిషిగా చూసుకుంటారు. అలాంటి కోడిపందేల కోసం ఇప్పుడే అంతా సిద్ధమయింది. పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తారు. అధికార పార్టీ నేతలు బరులను ఏర్పాటు చేయడంలో ముందుంటారు. పార్టీకి చెందిన అభిమానులు, కార్యకర్తలు ఆ బరుల వద్దకు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే ఈ పందేలను చూసేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి మంత్రులు కూడా తరలి వస్తుంటారు. కోనసీమ కూడా కోడిపందేలకు ప్రసిద్ధి. ముందుగానే భీమవరం, నరసాపురం, రాజమండ్రి ప్రాంతాల్లో హోటల్ రూమ్ లుకూడా ముందుగానే బుక్ చేసుకుని సంక్రాంతికి వెళ్లేందుకు ఇప్పటి నుంచే ప్లాన్ చేసుకుంటున్నారు అనేక మంది. ఫ్లైట్ టిక్కెట్ లు కూడా ముందుగానే బుక్ అవుతున్నాయి.అక్కడ ఏ సౌకర్యాలున్నాయన్న దానిపై సోషల్ మీడియాలో ఇప్పటికే ప్రచారం మొదలయింది. ఫుడ్ దగ్గర నుంచి అన్ని రకాలుగా వినోదాలను బరుల దగ్గర సిద్ధం చేస్తున్నారు. దీంతో సంక్రాంతి పండగకు ఉభయ గోదావరి జిల్లాలకు వెళ్లే వారికి సులువుగా సమాచారం లభిస్తుంది. ఇప్పటికే భీమవరం, ఏలూరు వంటి నగరాల్లో ప్రధాన లాడ్జీలన్నీ ముందుగానే బుక్ అయిపోయాయి. పందెంరాయుళ్లు సంక్రాంతి మూడు రోజులు కోడిపందేలు చూస్తూ కాలక్షపం చేస్తుంటారు. పందేలు కాస్తుంటారు. కొందరు అక్కడ దొరికే పసందైన ఫుడ్ ను తింటారు. మద్యంకూడా అక్కడే అందుబాటులో ఉండటంతో ఇక ముక్కతో పాటు మందు కూడా సేవించి ఫుల్లు ఎంజాయ్ చేస్తారు. పోలీసులు ఎప్పటిలాగానే ఈసారి కూడా కోడిపందేలపై ఆంక్షలున్నాయని చెబుతున్నా బరులు మాత్రం సిద్ధమవుతున్నాయి. ఇక వాటిని చూసి రావడమే మిగిలింది.

# సాగర తీరంలో సింగిల్ ఫ్రేమ్...

విశాఖపట్టణం, జనవరి 6, మూడు పార్టీల ముఖ్యనేతలు. మరోసారి ఒకే ఫ్రేమ్‌లో కనిపించబోతున్నారు. ఆరు నెలల కింద ఎన్నికలప్పుడు విజయవాడలో రోడ్ షో చేసిన ఆ నేతలు..ఇప్పుడు మళ్లీ సాగర తీరంలో సింగిల్ ఫ్రేమ్‌లో ఆకట్టుకోబోతున్నారు. ఆ అద్భుత సన్నివేశం కోసం మూడు పార్టీల నేతల క్యాడర్ వెయిట్ చేస్తున్నారు. మరోసారి ముగ్గురు అగ్రనేతలు ఒకే వేదిక మీద కనిపించబోతున్నారు. ఒకే ఫ్రేమ్‌లో వాళ్ల అభిమానుల్లో, పార్టీ శ్రేణుల్లో ఆనందం నింపబోతున్నారు. ఇంతకీ ఆ ముగ్గురు ఎవరంటే ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఈ ముగ్గురు ఒకే ఫ్రేమ్‌లో కనిపించడం సమ్‌థింగ్ స్పెషలే. ముఖ్యంగా ఏపీ ఎన్నికల సమయంలో పవన్, మోదీ డిస్కషన్.. వీడియోస్, ఫొటోస్ ఎంతగా వైరల్‌గా మారాయో తెలియంది కాదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కలిసి రోడ్ షో చేసిన ఈ ముగ్గురు నేతలు..ఇప్పుడు మరోసారి ఒకే డయాస్ మీద అట్రాక్ట్ చేయబోతున్నారు.ఈ నెల 8న ప్రధాని మోదీ విశాఖ పర్యటన ఖరారైంది. షెడ్యూల్ కూడా ఫిక్స్ అయింది. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపన కోసం వస్తున్న ప్రధాని మోదీ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌తో కలసి రోడ్‌షో చేయబోతున్నారు. అయితే ఏపీ ఎలక్షన్స్‌కు ముందు ఈ ముగ్గురు లీడర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అందులో పబ్లిక్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఎన్నికల్లో కూటమి బంపర్ విక్టరీ సాధించింది.కూటమి ప్రభుత్వం ఏర్పాటు సందర్భంగా ఏపీకి వచ్చిన ప్రధాని..ఆ తర్వాత ఈ ఏడాదిలో మొదటిసారి విశాఖకు రానున్నారు. భారీ విజయం దక్కించుకున్న కూటమి నేతలు చేయబోయే ర్యాలీపై ఇప్పుడు క్యాడర్‌లో ఎంతో ఆసక్తి ఏర్పడింది. అందుకు తగ్గట్లుగానే జనవరి 8న నిర్వహించే మోదీ, బాబు, పవన్ రోడ్‌షోకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. విజయోత్సవ ర్యాలీలాగా జరిపేలా సన్నాహాలు చేస్తున్నారు.ప్రధాని 8న మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి నేరుగా ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌కు చేరుకుంటారు. ఔఖఅ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుతో పాటు రైల్వేజోన్ పరిపాలన భవనాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసి, బహిరంగ సభలో ప్రసంగిస్తారు.ఆర్నెళ్ల పాలనలో సాధించిన విజయాలపై వివరించేందుకు రెడీ అవుతున్నారు కూటమి నేతలు. సభకు లక్ష మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఆశీల్‌మెట్టలో గల సంపత్ వినాయక్ ఆలయం నుంచి సభా ప్రాంగణం వరకూ ఓపెన్‌టాప్ వాహనంలో ప్రధాని రోడ్‌షో నిర్వహించనున్నారు. ఆయనతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ రోడ్‌షోలో పాల్గొంటారు.ప్రధాని టూర్‌ను గ్రాండ్ సక్సెస్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తుంది ఏపీ సర్కార్. ముగ్గురు మంత్రులతో పర్యవేక్షణ కమిటీని నియమించింది రాష్ట్ర ప్రభుత్వం. జన సమీకరణ బాధ్యతను స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలకు అప్పగించారు. అయితే రోడ్ షోలో ముగ్గురు నేతలు ఒకే ఫ్రేమ్‌లో కనిపించబోతుండటంతో..కూటమి పార్టీల క్యాడర్‌లో జోష్ కనిపిస్తోంది. అటు బీజేపీ క్యాడర్, లీడర్లు కూడా మోదీ టూర్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.అటు పవన్ ఫ్యాన్స్ కూడా తమ నేత రాక కోసం వెయిట్ చేస్తున్నారు. కూటమి రథసారధిగా చంద్రబాబు ఇచ్చే స్పీచ్‌పై వైజాగ్ ప్రజల్లోకి ఆసక్తికర చర్చ జరుగుతోంది. అటు ప్రధాని మోదీ వరాలు ప్రకటిస్తారని.. స్టీల్ ప్లాంట్‌పై ఏదైనా ప్రకటన చేస్తారని భావిస్తున్నారు ప్రజలు. చూడాలి మరి మోదీ టూర్‌ను కూటమి నేతలు రేంజ్‌లో సక్సెస్ చేయబోతున్నారో.

పిన్ టూ పిన్ ప్రోగ్రామ్ ఇదే

ఏపీలో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈనెల 8న విశాఖ రానున్నారు. ఏపీ సీఎం గా చంద్రబాబు ప్రమాణస్వీకారం కార్యక్రమానికి మోడీ హాజరయ్యారు. అటు తరువాత ఏపీకి రావడం ఇదే తొలిసారి. ఏపీలో ప్రధాని పర్యటనకు సంబంధించి షెడ్యూల్ కూడా ఖరారు అయ్యింది. లక్ష కోట్ల పెట్టుబడులకు సంబంధించి శంకుస్థాపనలు చేయనున్నారు మోదీ. అలాగే నగరంలో రోడ్ షో కూడా ప్లాన్ చేశారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్లో భారీ బహిరంగ సభ జరగనుంది. ఏపీకి సంబంధించి ప్రధాని మోదీ కీలక ప్రకటనలు చేస్తారని అంచనాలు ఉన్నాయి. సాయంత్రం 4:15 గంటలకు విశాఖలోని ఐఎన్ఎస్ డేగాలో దిగుతారు. ఈ సందర్భంగా ప్రధానికి రాష్ట్ర గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం, ఇతర ప్రముఖులు స్వాగతం పలుకుతారు. ఈ సందర్భంగా నేవీ నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరిస్తారు. అటు తరువాత అక్కడ నుంచి రోడ్ షో బహిరంగ సభ వేదికకు చేరుకోనున్నారు ప్రధాని మోదీ. ప్రధాని పర్యటనకు సంబంధించి ఇన్చార్జిగా మంత్రి నారా లోకేష్ వ్యవహరించనున్నారు.నగరంలోని ప్రధాన జంక్షన్ లను కలుపుతూ మోడీ పర్యటన కొనసాగనుంది. తాటి చెట్ల పాలెం జంక్షన్, సంపత్ వినాయక్ గుడి, దత్త ఐలాండ్ మీదుగా.. ఏయూ ఎకనామిక్స్ విభాగం ఎదురుగా ఉన్న వెంకటాద్రి వంటిల్లు వరకు.. రోడ్డు షోలో పాల్గొంటారు ప్రధాని మోదీ. ఓపెన్ టాప్ వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ సాగుతారు. త్రీ టౌన్ జంక్షన్ మీదుగా ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానానికి చేరుకుంటారు.కాగా ఈ రోడ్డు షోకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఓపెన్ టాప్ వాహనంపై ప్రధాని మోదీ తో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సైతం పాల్గొనే అవకాశం ఉంది. సాయంత్రం 5:30 నుంచి 6:30 గంటల వరకు ప్రధాని సభా ప్రాంగణంలోనే ఉంటారు. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. సాయంత్రం 6:30 గంటలకు సభ ముగిసిన తరువాత రోడ్డు మార్గాన ఎయిర్పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్తారు. కాగా ఇది పూర్తి అధికారిక పర్యటన. రాజకీయ ప్రసంగాలు ఉండవని తెలుస్తోంది.ప్రధాని పర్యటన వేళ ఏపీకి సంబంధించి చాలా రకాల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ సానుకూలత వ్యక్తం చేసే అవకాశం ఉంది. ఇప్పటికే అమరావతి తో పాటు పోలవరం అంశాల్లో కేంద్రం సాయం ప్రకటించింది. అయితే పెండింగ్ ప్రాజెక్టులు చాలా ఉన్నాయి. ముఖ్యంగా విశాఖ స్టీల్ అంశం పెండింగ్లో ఉంది. దీనిపై ప్రధాని మోదీ స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. అందుకే ప్రధాని పర్యటనపై అంత ఉత్కంఠ కొనసాగుతోంది.

## మార్చి 12 నుంచి పిఠాపురంలో జనసేన ప్లీనరి

కాకినాడ, జనవరి 6, లో సంచలన విజయం సాధించింది జనసేన పార్టీ. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి డిజాస్టర్ ఫలితాలను సాధిస్తూ వచ్చింది. సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఎన్నికల్లో శత శాతం విజయాన్ని సాధించింది. దీంతో ఏపీ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా మారింది. వాస్తవానికి ఆ పార్టీ విషయంలో జరిగిన విషప్రచారం అంతా అంతా కాదు. అది ఒక పార్టీయేనా అన్నంతగా ప్రచారం నడిచింది. ఎన్నెన్నో అవమానాలు పడ్డారు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్. వాటన్నింటిని అధిగమించి సాలిడ్ విజయాన్ని అందుకున్నారు. తెలుగు నాట తిరుగులేని రాజకీయ శక్తిగా జనసేన ను నిలిపారు. ఈ క్రమంలో ఆ పార్టీ ప్రతి అడుగు సాహసమే. ప్రతికూల ఫలితాలను చవిచూసిన ఆ పార్టీ.. అనతి కాలంలోనే తిరుగులేని రాజకీయ శక్తిగా మారింది. ఏపీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించింది. 2014 ఎన్నికల నాటికి జనసేన ఒక సామాన్య సంస్థగా ఆవిర్భవించింది. అప్పటికే ఎన్నికలు సమీపించడంతో రాష్ట్రంలో టిడిపి, కేంద్రంలో బిజెపికి మద్దతు తెలిపింది. ఆ పార్టీ మద్దతుకు అనుగుణంగా రెండు చోట్ల అనుకూల ప్రభుత్వాలు వచ్చాయి. అయినా సరే జనసేన ఒక సామాన్య పార్టీగా ప్రజల మధ్యకు వెళ్లేందుకు ప్రయత్నించింది. తాము మద్దతు తెలిపిన పార్టీలు అధికారంలోకి వచ్చిన ఎన్నడు దానిని సొంత అవసరాలకు ఉపయోగించుకోలేదు. 2019 ఎన్నికల్లో ఒంటరిగా బరిలో దిగింది జనసేన. కనీస స్థాయిలో కూడా ఉనికి చాటుకోలేదు. దారుణ పరాజయాన్ని చవిచూసింది. అయినా సరే మొక్కవోని దీక్షతో గత ఐదేళ్లుగా ప్రజా సమస్యలపై పోరాటం చేసింది. టిడిపి తో పాటు బిజెపితో జతకట్టింది. కూటమిగా ముందుకు కదిలింది. వైసీపీకి దారుణంగా దెబ్బతీసింది. పోటీ చేసిన 21 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించి తనకు తిరుగులేదని నిరూపించుకుంది. ఏపీలో ప్రభావవంతమైన రాజకీయ శక్తిగా నిలిచింది జనసేన.అయితే తాజాగా జనసేన విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. జనసేన ప్లీనరీని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. డిప్యూటీ సీఎం పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో మార్చి 12 నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించాలని డిసైడ్ అయ్యారు. ఈ మేరకు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దానికి చైర్మన్గా వ్యవహరిస్తున్న నాదెండ్ల మనోహర్ ఈ విషయాన్ని ప్రకటించారు. పార్టీ తిరుగులేని విజయం కనబరచడంతో ఈసారి ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావిస్తున్నారు. జనసేన బలోపేతంతో పాటు పార్టీలో భారీగా చేరికలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది.

## ఫిబ్రవరి మొదటి వారంలో జగన్ టూర్లు

గుంటూరు, జనవరి 6, జగన్ జిల్లాల పర్యటన ఎప్పుడు? సంక్రాంతి మూడో వారంలోనా? తరువాత చేస్తారా? ఇప్పుడు ఇదే ఆసక్తికర చర్చ. సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వస్తానని జగన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. జనవరి మూడో వారం నుంచి జిల్లాల పర్యటన చేయనున్నట్లు జగన్ ప్రకటించారు. 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో.. వారానికి రెండు రోజులపాటు బస చేస్తానని చెప్పుకొచ్చారు. దీంతో పార్టీ శ్రేణులు ఒక రకమైన ఉత్సాహం కనిపించింది. అయితే ఇప్పుడు రెండోవారం సమీపిస్తున్న ఎటువంటి సన్నాహాలు లేకుండా పోయాయి. పైగా తాజా పరిణామాలతో జగన్ జిల్లాల పర్యటన ఇప్పుడే కాదని తేలిపోయింది. దీంతో వైసీపీ శ్రేణుల్లో ఒకరకమైన అసంతృప్తి వ్యక్తం అవుతోందిఈ ఎన్నికల్లో వైసిపి దారుణంగా ఓడిపోయింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఆ పార్టీకి దక్కలేదు. దీంతో చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. ఇంకొందరు సిద్ధంగా ఉన్నారు. ఇంకోవైపు కూటమి దూకుడుకు పార్టీ శ్రేణులు తట్టుకోలేకపోతున్నాయి. కేసులతోపాటు దాడులు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో పార్టీ క్యాడర్ కు భరోసా కల్పించేలా జిల్లాల పర్యటన చేయాలని జగన్ భావించారు. వారంలో రెండు రోజులపాటు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో గడపాలని డిసైడ్ అయ్యారు. ఇదే విషయం జగన్ స్వయంగా ప్రకటించడంతో పార్టీ శ్రేణులు కొంత ఆనందించాయి. తమకు అండగా నిలబడేందుకు అధినేత ముందుకు రావడాన్ని ఆహ్వానించాయి.అయితే ఇప్పుడు జగన్ జిల్లాల పర్యటన జనవరిలో లేనట్టేనని తేలిపోయింది. ఈనెల 11 నుంచి 2 వారాలపాటు జగన్ విదేశీ పర్యటనకు వెళ్ళనున్నారు. ఈ మేరకు ఆయన సిబిఐ కోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. తన విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని కోరారు.

## టైక్వాండో లో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థిని



విభారేన్యూస్ నందికొట్కూరు:..జాతీయస్థాయి టైక్వాండో పోటీలలో నందికొట్కూరు శ్రీ చైతన్య విద్యార్థినికి ప్రథమ బహుమతి. వైజాగ్ లో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో నందికొట్కూరు శ్రీ చైతన్య విద్యార్థిని పింజరి సుహానా ప్రథమ బహుమతి సాధించినదని ప్రిన్సిపాల్ దీప తెలియజేశారు. ఈ విజయం సాధించడానికి తనకు రాంబాబు అనే తైక్వాండో మాస్టర్ దగ్గర తీసుకున్న శిక్షణ ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థిని తల్లిదండ్రులు తెలియజేశారు. చైతన్య పాఠశాలల ఏజీఎం సురేష్ మరియు ఆర్ ఐ కోటయ్య చౌదరి మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

## నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ...

**కూటమి ప్రభుత్వం వచ్చాక 19 ఆర్టీసీ బస్సులను తీసుకొచ్చాం..**



విభారే న్యూస్ జనవరి 06 ఎమ్మిగనూరు..గత ప్రభుత్వం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోకు ఒక బస్సు కాదు.. ఒక టైరు కూడా తీసుకొచ్చిన పాపాన పోలేదని,కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రయాణికులకు ఇబ్బందికరంగా లేకుండా 6 నెలలలో నాలుగు సార్లు 19 కొత్త ఆర్టీసీ బస్సులను తీసుకొచ్చామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అన్నారు.సోమవారం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో 2 కొత్త బస్సులను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా కూటమి ప్రభుత్వం త్వరలోనే ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతి రహదారిలో బస్సులను తిరుగుతాయని స్పష్టం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్, టీడీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపిలో పదవులు వరించిన వారికి సత్కారం

బద్వేలు ,వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు వై.యస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధికార ప్రతినిధిగా బిజివేముల రామ సుబ్బారెడ్డి , జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా రమేష్ బాబు నియమితులైన సందర్భంగా బద్వేలు పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నందు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలవాతో సత్కరించారు అనంతరం వారు మాట్లాడుతూ వివిధ హోదాలలో నియమించి నందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పదవి వచ్చేందుకు కి ముఖ్య కారకులైన డీసీ గోవిందరెడ్డి సార్ గారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు మా రాజకీయ ఎదుగుదలకు ముఖ్య కారకులైన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మాజీ స్వచ్ఛంద డైరెక్టర్ కేశవరెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, పుత్త శ్రీరాములు,రఘురాం రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# దక్షిణాది రాష్ట్రాల జర్నలిస్టు ల కోర్డినేషన్ కమిటీ సభ్యునిగా టీ.మద్దులేటి నియా మకం



**జర్నలిస్టు ల హర్షం**

**జర్నలిస్టు లకు జాతీయ పెన్షన్ విధానం ప్రవేశ పెట్టాలి**

**పదవీ విరమణ చేసిన జర్నలిస్టు లకు నెలకు రూ.20000లు ఇవ్వాలి**

**జర్నలిస్టు లకు నివాస స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలి**

**చెన్నై నగరంలో జరిగిన సమా వేశంలో తీర్మానం**




విభారే న్యూస్ కర్నూల్ ప్రతినిధి జనవరి 6.జర్నలిస్టు లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం దక్షిణాది రాష్ట్రాల జర్నలిస్టు ల కోర్డినేషన్ కమిటీ ఏర్పాటు అయింది ఆదివారం చెన్నై నగరంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు కమిటీ సభ్యులుగా ఆంధ్ర ప్రదేశ్ నుంచి టీ.మద్దులేటి కర్నూల్ ని ఎన్నుకున్నారు ప్రస్తుతం మద్దులేటి ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కార్యదర్శిగా వ్యవహారిస్తున్నారు మద్దులేటి దక్షి నాది రాష్ట్రా ల జర్నలిస్ట్ ల కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా ఎన్నికవటం పట్ల జర్నలిస్టు లు హర్షం వ్యక్తం చేశారు.ఇక పోతే కమిటీ కన్వీనర్ గా శ్రీమతి శాంతి కుమారి కర్ణాట క సభ్యులుగా బండి విజయ్ కుమార్ తెలంగాణా శ్రీమతి మంజుల కర్ణాటక శ్రీ రమేష్ పాండి చేరి యన్ పి సేరుకుట్టి కేరళ ఎన్నికయ్యారు జర్నలిస్టుల సంక్షేమనికి ప్రత్యేకంగా కేంద్ర రా ష్ట్రాల బడ్జెట్ల లో ప్రత్యేక నిధులు కె టా యించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ తీర్మానించినట్లు మద్దులేటి తెలిపారు శ్రీమతి శాంతకుమారి అధ్యక్ష తన జరిగిన సమావేశంలో ఆ ల్ ఇండియా న్యూస్ పేపర్స్ ఉద్యోగుల సంఘం ప్రసి డెంట్ శ్రీ భూ ప తి తెలంగాణ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉపా దక్షుడు శ్రీ పులుపల ఆనందం ఏ పి నాయకులు కర్నూల్ కె. మధుసూధనరావు కె.చంద్రశేఖర్ రమేష్ మునిస్వామి టీజెఫ్ నాయకులు మహబూబ్నగర్ బండి విజయ్ కుమార్ పసుపల శ్రీనివాస్ తదితర నేతలు పాల్గొన్నారు

# కుష్టి వ్యాధి నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణ




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 06 – కుష్టి వ్యాధి నిర్ధారణ కోసం ఈనెల 20వ తేదీ నుండి వచ్చే నెల 2వ తేదీ వరకు ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ ఎస్ లో భాగంగా కుష్టి వ్యాధి నిర్మూలన గోడ పత్రికను కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, వైద్యాధికారులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ కుష్టి వ్యాధి నిర్ధారణ కోసం చేపట్టే ఇంటింటి సర్వే కార్యక్రమంలో ఏఎన్ఎం లు, ఆశ వర్కర్లు చురుకుగా పాల్గొని కుష్టి వ్యాధి లక్షణాలపై స్వీయ పరీక్షలు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, పొడి చర్మంపై బుడిపలు తదితర లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించి వైద్య కేంద్రాలకు తీసుకురావాలన్నారు. 2027 సంవత్సరం నాటికి కుష్టి వ్యాధి లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు దృఢ సంకల్పంతో సర్వే నిర్వహించాలన్నారు. సర్వేను హేతుబద్ధంగా నిర్వహించేందుకు 1611 బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. స్త్రీ లలో అనుమానిత రోగులను గుర్తించేందుకు ఆశ వర్కర్లను, మగవారిలో కుష్టి అనుమానిత రోగులను పరిశీలించేందుకు మగ వాలంటీర్లు ఏర్పాటు చేశామన్నారు. కుష్టి వ్యాధి ఎలా వస్తుంది, అపోహలు ఏమిటి, రోగిని ఎలా ఆదరించాలి, వ్యాధి లక్షణాలు గుర్తించి సంపూర్ణ చికిత్స అందించేందుకు వైద్య బృందాలు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటివరకు 85 మంది కొత్త రోగులను గుర్తించి వారికి చికిత్స నిర్వహించడం జరుగుతుందన్నారు. గత పదేళ్లల్లో 1757 మంది కుష్టి రోగులను గుర్తించి వైద్య చికిత్సలను అందించడం ద్వారా కోలుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్. వెంకటరమణ, లెప్రసి, ఎయిడ్స్,టిబి అధికారి డా.శారదాబాయి, పారామెడికల్ ఆఫీసర్ ఈజాజుల్ హక్ తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు వల్లే ఆర్థికంగా అభివృద్ధి

**---మెప్మా సీఎంఎం శోభ---**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 06 – ప్రతి ఒక్కరికీ పొదుపు అనేది చాలా అవసరమని పొదుపు చేయడం వల్ల ఆర్థికంగా బలోపేతం చెంది వివిధ రంగాల్లో అభివృద్ధి చెందారని మెప్మా సీఎంఎం శోభ పేర్కొన్నారు. మున్సిపల్ ఆఫీసులోని మెప్మా కార్యాలయంలో సోమవారం రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు డైరెక్టర్. వి. ఆంజనేయులు. మేనేజర్ అశోక్ కుమార్ పర్యవేక్షణ లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీ సుబోధ్ బి వాన్వే హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు వివిధ డిపాజిట్ ఖతాల గురించి తెలుసుకోవాలి అని ప్రతి ఒక్క పౌరుడు ఆర్థిక ప్రణాళిక మరియు బడ్జెట్ పై అవగాహన కలిగి ఉండి తప్పకుండా పాటించాలన్నారు. ఎపిజిబి బ్యాంకు సీనియర్ మేనేజర్ రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. డిజిటల్ పేమెంట్స్ ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు , మీ యొక్క ఓటీపీ పిన్ నెంబర్లు వ్యక్తిగత వివరాలు ఇతరులతో పంచుకోకూడదు . ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కూడా వ్యక్తిగత పొదుపు అనేది చాలా ముఖ్యం అని మరియు ప్రతి ఒక్క మహిళ యోజన కూడా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన జీవనజ్యోతి బీమా యోజన తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మెప్మా సి ఎం ఎం శోభా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి పొదుపు అనేది చాలా అవసరమని పొదుపు చేయటం వల్లే ఈరోజు మహిళలందరూ కూడా ఆర్థికంగా బలోపేతం చెంది వివిధ రంగాలలో అభివృద్ధి చెందుతున్నారని దీనిని భవిష్యత్తు తరాలకు కూడా నేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా కార్యాలయ సిబ్బంది మరియు సి ఓ లు, ఆర్పీలు, ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగినది.

## ఓటర్ల తుది జాబితా--

**డిఆర్ఓ రాము నాయక్--**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 06 – భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం చేపట్టి తుది ఓటర్ల జాబితా విడుదల చేశామని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ తెలిపారు. సోమవారం డిఆర్ఓ ఛాంబర్ లో తుది ఓటర్ల జాబితా పత్రలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు.ఈ సందర్భంగా డిఆర్ఓ రాము నాయక్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమ అనంతరం జిల్లాలో 13,92,036 మంది ఓటర్లు ఉన్నారన్నారు. జిల్లాలోని 1629 పోలింగ్ స్టేషన్ పరిధిలో పురుష ఓటర్లు 6,81,581మంది, మహిళా ఓటర్లు 7,10,193 మంది, ఇతరులు 262 మంది ఉన్నారన్నారు. అన్ని నియోజకవర్గాల పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఈఆర్వోలు తుది ఓటర్ల జాబితాను విడుదల చేసి ప్రదర్శిస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ తరఫున నాగ శివ సాయి సందీప్, సిపిఎం తరపున పీ.నరసింహులు, కాంగ్రెస్ పార్టీ తరపున రియాజ్ భాష, టిడిపి తరపున శివరామిరెడ్డి ఎన్నికల విభాగపు సూపర్డెంట్ జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో రక్త నిల్వ కేంద్రం ఏర్పాటు---

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా---**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 06 – – కొత్త సంవత్సరంలో నంద్యాల పట్టణంలోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో రక్త నిల్వ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా వివిధ అభివృద్ధి అంశాలపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో నంద్యాల పట్టణంలోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయపు భవనంలో రక్త నిల్వ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు



చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి ల్యాబ్, మెడికల్ పరికరాల కొరకు కలెక్టరేట్ నుండి 15 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల నిధులతో బ్లడ్ రిఫ్రిజిరేటర్స్ సెంట్రిఫ్యూజ్ , జీరో టిడిఎస్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు థైరాయిడ్ టెస్ట్ నిర్వహించేందుకు పరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించి సచివాలయ సిబ్బందికి ఓరింటేషన్ కార్యక్రమం నిర్వహించి పుట్టిన బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రాలు, మరణించిన వ్యక్తులకు మరణ ధ్రువీకరణ పత్రాలు నిర్ణీత గడువులోగా సంబంధిత వ్యక్తులకు పత్రాలు పంపిణీ చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఈ కేవైసీ పూర్తి చేసి కంప్యూటరికరించేలా సచివాల సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు.

## పట్టణంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లే---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 06– నంద్యాల పట్టణం లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లే. హోల్ సేల్ దుకాణం నుంచి తోపుడు బండ్ల వరకు ప్రతి రోజూ ప్లాస్టిక్ కవర్లు వాడకమే అధికం. అప్పుడప్పుడు మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేస్తారే గాని పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నియంత్రణ చేయడంలో విఫలం అయ్యారని స్థానికుల విమర్శలు



వినిపిస్తున్నాయి . ప్లాస్టిక్ వల్ల మనుషులు లకు క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు డాక్టర్లు చెబుతున్నారు . అలాగే ప్లాస్టిక్ వల్ల పసువులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడం వల్లే పట్టణంలో ప్రతి దుకాణాలల వ్యాపారం జోరుగా సాగుతోంది . ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ పై ఉక్కు పాదం మోపాలని స్థానికులు కోరుతున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**